క్లుప్తంగా

నేడు ఎడ్ల బండ్ల పోటీలు

గట్టు: శ్రీరామనవమి సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో ఎడ్ల బండ్ల గిరక పోటీలు, సందెపురాళ్ల పోటీలు నిర్వహిస్తున్నట్లు గండి ఆంజనేయస్వామి దేవస్థాన కమిటీ సభ్యులు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు ఈ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎడ్ల బండ్ల గిరక పోటీల్లో మొదటి బహుమతి రూ.5,000లు, ద్వితీయ బహుమతి రూ.3000లు, తృతీయ బహుమతి రూ.2000లను అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బహుమతులు బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి అందించనున్నట్లు పేర్కొన్నారు.

సంఘటితంగా పోరాడాలి



గద్వాల అర్బన్: కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా పోరాడాలని, అప్పుడే సమస్యలు పరిష్కారం అవుతాయని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో గద్వాల మండల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. సంపాదన సృష్టించిన కార్మికవర్గానికి ప్రతిఫలాలు దక్కకుండా ప్రభుత్వాలు బడా పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తులకు దేశంలోని సహజ వనరులను ధారాదత్తం చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసే కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

మండల కమిటీ ఏకగ్రీవం

అనంతరం మండల కమిటీని 22 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాజేష్, ప్రధాన కార్యదర్శిగా ఉప్పేరు నర్సింహ, ఉపాధ్యక్షులుగా మోహనదేవి, పద్మ, బాలరాజ్, నరేష్, విష్ణు, తిమ్మప్ప, పది మంది సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వెంకటరామయ్య, బాలు, వెంకటన్న, తదితరులు ఉన్నారు.

భారీ మెజార్టీతో గెలిపించాలి



ధరూరు: బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్ ప్రసాద్ సోమవారం రాత్రి మండలంలో పర్యటించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మండల పరిధిలోని మన్నాపురంలో కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కొత్తపాలెం, అల్వలపాడు, జాంపల్లి, ధరూరు తదితర గ్రామాల కార్యకర్తలు, నాయకులు భరత్ ప్రసాద్‌ను కలిశారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం

శాంతినగర్: వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని శాంతినగర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రధాని నరేంద్రమోదీ పదేళ్ల కాలంలో చేపట్టిన వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ కార్యవర్గ సభ్యులు అయ్యంగారి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, జలగరి అశోక్, మధుసూదన్‌గౌడ్, తిరుమల్, మాదన్న, రామకృష్ణ, రాఘవేంద్ర, వెంకటేష్, నరసింహ పాల్గొన్నారు.

పోలీస్ బందోబస్తు

మానవపాడు: ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ వాహనయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదుట బీజేపీ మండల కార్యాలయం ఉండడంతో ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

అక్రమ రిజిస్ట్రేషన్‌పై ఎంపీఓకు ఫిర్యాదు

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని కొండేరులో ఎలాంటి ఆధారాలు లేకుండా గతంలో విధులు నిర్వహించిన పంచాయతీ కార్యదర్శి మస్తాన్ ఒకరి ఇంటిని మరొకరి పేరుపై రిజిస్ట్రేషన్ చేశారని మంగళవారం ఎంపీఓ భాస్కర్‌కు గ్రామస్తుడు వెంకటేష్ వినతిపత్రం అందజేశారు. దీనివల్ల నిజమైన బాధితులకు తీవ్ర అన్యాయం జరిగిందని, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేసి బాధితులకు తగిన న్యాయం చేయాలని కోరారు.

ఆరుగురిపై కేసు నమోదు

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరులో ఎద్దుల పందేలను నిర్వహించారు. బలవంతంగా జంతువులను హింసిస్తున్నారని బండ పందేలు నిర్వహిస్తున్న ఆరుగురిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సుబ్బారెడ్డి తెలిపారు.

బైక్, ఆటో ఢీ: ఇద్దరికి గాయాలు

ఉండవెల్లి: మండలంలోని ఇటిక్యాలపాడు శివారులోని జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న ఆటో, బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలైన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. ఇటిక్యాలపాడు శివారులోని జాతీయ రహదారిపై హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు బైక్‌పై హరిప్రీతమ్ వెళ్తున్నాడు. ఇదే క్రమంలో కర్నూల్ వైపే ఆటోలో షేక్షావలి వెళ్తుండగా రెండు ఢీకొని రోడ్డు పక్కకు పడిపోయాయి. ఇరువురికి గాయాలు కావడంతో 108లో కర్నూల్ ఆస్పత్రికి తరలించారు.

ఆదమరిస్తే.. ప్రమాదమే

- ట్రాన్స్‌ఫార్మర్లకు కరువైన కంచెలు
- ప్రజలకు పొంచి ఉన్న ప్రమాదం
- పట్టించుకోని అధికారులు
- ఎండలకు మండుతున్న ట్రాన్స్‌ఫార్మర్లు



తక్కశిలలో ఇళ్ల పక్కనే కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్



పుల్లూరులో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్



ఉండవెల్లిలో శిథిలావస్థకు చేరిన ట్రాన్స్‌ఫార్మర్

ఉండవెల్లి: మండలంలోని ప్రధాన కూడళ్లు, రహదారుల పక్కన ఏర్పాటు చేసిన పలు ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచెలు లేక ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ ట్రాన్స్‌ఫార్మర్లు చేతికి అందే ఎత్తులో ఉండడంతో ఎప్పుడు ఏయే ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మండల కేంద్రంలోని చిన్న ఆముదాలపాడు గ్రామానికి వెళ్లే క్రమంలో శ్మశానవాటికకు ఎదురుగా ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతిని, రాయికట్టడం కూడా దెబ్బతినడంతో కంచె లేకపోవడంతో, ఎప్పుడు వాహనాలు తిరిగే రహదారి పక్కనే ఉండడంతో వాహనదారులు, ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. చిన్న ఆముదాలపాడులో రహదారి పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ ఉన్నా అక్కడ పశువులు, ప్రజలు తిరుగుతుంటారు. కంచె ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఆవేదన చెందుతున్నారు.

తక్కశిల గ్రామంలో పాఠశాల పక్కన రహదారికి ఆనుకుని ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన అది ఇంటికి, విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తే విధంగా ఉంది. విద్యార్థుల పాఠశాలకు వెళ్లే క్రమంలో విద్యుత్ స్తంభానికి అమర్చడంతో చిన్నారులు భయ పడుతూ బడికి వెళ్తున్నారు. బస్వాపురంలో పాఠశాలకు వెళ్లే క్రమంలో రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్న కంచె ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. బైరాపురంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె లేకపోవడంతో గతేడాది రెండు ఎద్దులు, పోటేళ్లు మృతి చెందాయి. కానీ కంచె ఏర్పాటు చేయలేదు. పుల్లూరులో ఇళ్లు అధికంగా ఉన్న కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు లేక పోవడంతో చుట్టు పక్కల కాలనీ వాసులు రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఎండలకు ట్రాన్స్‌ఫార్మర్లలో మంటలొస్తాయి..

రహదారుల పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లలో అధిక శాతంలో ఎండలు ఉండడంతో మంటలు వ్యాప్తి చెందుతాయని భయపడుతున్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఎర్తువైర్లు ఉండడంతో ఎలాంటి ప్రమాదాలు సంభవిస్తాయోనని భయం భయంగా ఉంటున్నారు. ఎండలకు విద్యుత్ వైర్లలలో మంటలు చెలరేగి నేలకు పడడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని, వాటిని అరికట్టాలని కోరుతున్నారు.

కరెంటు అంతరాయం అధికం..

ఎండలు 42 డిగ్రీల కంటే అధికంగా ఉండడంతో ఇంట్లో నుంచి ప్రజలు భయటకు రాలేకపోతున్నారు. ఎండకు వెళ్లి ఇంటికి వచ్చే క్రమంలో ఇంట్లో కరెంటు కష్టాలు మొదలయ్యాయి. విద్యుత్ అధికారులు ఎండాకాలంలోనే మరమ్మతులు చేపడుతున్నారు. ఎండలకు కరెంట్‌ను కట్ చేసి ఉక్కపోతతోనే చిన్నారులకు, వ్యాధిగ్రస్తులకు, బాలింతలకు, ఇబ్బందులు కలిగిస్తున్నారు. సెలువు రోజుల్లో విద్యుత్ మరమ్మతులు చేయిస్తున్నా కష్టాలు మాత్రం చవిచూస్తున్నారు.

కంచె లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం..



పాఠశాలకు వెళ్లే క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె ఏర్పాటు చేయ్యాలి. కానీ విద్యార్థులు ఉన్న అధికారులు కంచెను ఏర్పాటు చేయడం లేదు. ఇప్పటికైనా అధికారులు కంచెను ఏర్పాటు చేయించి ప్రమాదాలను నివారించాలి.

– నరసింహ, బస్వాపురం

అధికారులు పట్టించుకోవాలి



చిన్న ఆముదాలపాడులో ట్రాన్స్‌ఫార్మర్ ఒక్కటే ఉన్నా కంచె ఏర్పాటు చేయలేకపోతున్నారు. రోడ్డు పక్కనే ఉండడంతో ఇబ్బందులు పడుతున్నాం. రక్షణ చర్యలు తీసుకోవాలి.

– రాజు, చిన్న ఆముదాలపాడు

కంచె ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం..

ప్రతి గ్రామంలో విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె ఏర్పాటు చేయించి ముల్ల పొదలను తొలగిస్తున్నాం. ఏదో ఒకటి చొప్పున మంటలు చెలరేగడం ఎండలో సహజం. ఎక్కడ జరుగుతుంటాయో తెలియని పరిస్థితి. కంచె ఏర్పాటు చేసినా, విద్యుత్ వైర్లు వేలాడుతున్న చోట చెట్లను తొలగించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– శివ, విద్యుత్ ఏఈ, ఉండవెల్లి

నిర్బంధంతో ప్రజావ్యతిరేకతను ఆపలేరు



మాట్లాడుతున్న న్యాయవాది మధుసూదన్ బాబు

గద్వాల అర్బన్: నిర్బంధాలు, అణిచివేతలతో ప్రజావ్యతిరేకతను ఆపలేరని వివిధ సంఘాల నాయకులు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ప్రముఖ పాత్రికేయుడు ప్రబీర్ పురకాయస్తా రచించిన 'అలుపెరగని పోరాటం' అనే పుస్తకాన్ని వారు ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నందుకు అక్రమంగా అరెస్టు చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది మధుసూదన్ బాబు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, దళిత ఐక్యవేదిక కన్వీనర్ ఆర్ మోహన్, బహుజన రాజ్యసమితి నాయకులు వినోద్ తదితరులు ఉన్నారు.

రేషన్ బియ్యం అమ్మితే చర్యలు



రేషన్ షాప్‌ను తనిఖీ చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మంగమ్మ

అయిజ: ప్రభుత్వం పేద ప్రజలకోసం ఏర్పాటు చేసిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా అమ్ముకుంటే చర్యలు తప్పవని ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మంగమ్మ హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని రేషన్ షాప్ నెంబర్లు 1,2,4,5,6,9,10,11,12,43,44,45,46 తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీబీలను, ఆర్ఓలను, కాంటాలను పరిశీలించారు. వినియోగదారులతో మాట్లాడి మాట్లాడారు. ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా పేద వారికి అందిస్తున్న బియ్యంలో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయని, ముఖ్యంగా రేషన్ బియ్యంలో పోరిక్ ప్రోటీన్స్ ఉంటాయని, వాటిని తింటే రక్తహీనత నుంచి బయటపడొచ్చని అన్నారు. రేషన్ షాప్‌ల నిర్వహణ, యజమానుల పనితీరుగురించి వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు. రేషన్ బియ్యం అమ్మడం, కొనడం నేరమని, క్రయ, విక్రయాలు చేసిన వారిపై కేసులు నమోదు చేసి చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఏర్పాటు



గట్టులో మాట్లాడుతున్న ఎంఈఓ కొండారెడ్డి

గట్టు: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల సమావేశాన్ని ఎంపీడీఓ చెన్నయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ చెన్నయ్య, ఎంఈఓ కొండారెడ్డిలు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించేందుకు ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలలుగా ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించడం, పాఠశాలలను బలోపేతం చేయడం, పర్యవేక్షించడం నిర్వహణ, విద్యార్థులకు యూనిఫాంల అందజేత, మధ్యాహ్నభోజన పథకం అమలు, పారిశుద్ధ్యం పనులను ఇక నుంచి అమ్మ ఆదర్శ కమిటీలకు అప్పగించనున్నట్లు తెలిపారు. గ్రామ సమాఖ్య అధ్యక్షులు కమిటీ అధ్యక్షుడిగా, హెడ్మాస్టర్లు కన్వీనర్లుగా ఉండనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ లక్ష్మన్న, ఏపీఓ స్వామి, ఏపీఎం సాంబశివుడు, వివిధ పాఠశాలల హెడ్మాస్టర్లు, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను అధికారులు ఎన్నుకున్నట్లు ఎంపీడీఓ అబ్దుల్ జబ్బార్, ఎంఈఓ శివ ప్రసాద్ తెలిపారు. మండల కమిటీలు, గ్రామ కమిటీలలో అధికారులు, ప్రధానోపాధ్యాయులు, మహిళా సమాఖ్య అధికారులను ఎన్నుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎమ్ కోటేశ్వరి, ప్రధానోపాధ్యాయులు, సీసీ ఉన్నారు.



ఉండవెల్లిలోని సమావేశమైన అధికారులు

విద్యార్థుల సంఖ్యను పెంచాలి

ఎర్రవల్లిచౌరస్తా: ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఎంపీడీఓ అజార్ మొహియుద్దీన్ అన్నారు. ఎర్రవల్లి మండల కేంద్రంలోని ఎస్ఎస్ ఆడిటోరియంలో ప్రధానోపాధ్యాయులు, గ్రామ మహిళా సంఘం అధ్యక్షులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ రాజు, ఎంపీడీఓ మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అమీర్‌బాషా, ఉదయ్, కిరణ్, శ్రీకుమార్ ఉన్నారు.

మానవపాడు: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, అమ్మ ఆదర్శ పాఠశాలలో మౌలిక వసతుల ఏర్పాటుకు కృషి చేయాలని ఎంఈఓ శివప్రసాద్ సూచించారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధ్యాయులు, మహిళా కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఎన్ఓ విష్ణువర్ధన్, ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, ఏఈ సతీష్ పాల్గొన్నారు.

పంచలోహ విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠ



అయిజ: పట్టణంలోని కొత్త బస్టాండ్ కాలనీలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో సీతారాముల పంచలోహ విగ్రహాలకు మంగళవారం వేదపండితులు ప్రాణ ప్రతిష్ఠ చేశారు. శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించనున్న సీతారాముల కల్యాణం పురస్కరించుకొని తయారు చేసిన పంచలోహ విగ్రహాలకు వేదపండితులు శాస్త్రోక్తంగా వేదమంత్రాలు జపిస్తూ ప్రాణ ప్రతిష్ఠ చేశారు. కార్యక్రమానికి వివిధ కాలనీల నుంచి భక్తులు హాజరయ్యారు.

గ్రామ దేవతలకు పూజలు

రాజోళి: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో మంగళవారం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివాహాలు, ఇతర శుభకార్యాలు చేసే ముందు తమ మొక్కులు చెల్లించుకునే క్రమంలో గ్రామాల్లో ఎల్లమ్మ, మారెమ్మ, సుంకులమ్మ, జమ్ములమ్మ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. చిన్నధన్వాడలోని మారెమ్మకు, గద్వాల జమ్ములమ్మకు పూజలు నిర్వహించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా చేతుల మీదుగా తెలంగాణ ప్రభుత్వ డిగ్రీ గెస్ట్ లెక్చరర్ అసోషియేషన్ 2024 సంవత్సరానికి సంబంధించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీపతినాయుడు, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ లవీన మంజులత, అతిథి అధ్యాపకులు, తదితరులు ఉన్నారు.

ఎంఈఓకు సన్మానం

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల నూతన విద్యాధికారిగా ఇటీవల నియమితులైన ఎంఈఓ రాజును మంగళవారం ప్రధానోపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఎంఈఓకు పూల మాలలు వేసి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

బాలసదన్‌కు కూలర్ వితరణ



గద్వాల అర్బన్: మున్సిపల్ మాజీ చైర్మన్ అక్కల సాయిబాబ 24వ వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు రమసాయిబాబ, నందిని, నందన్‌కుమార్‌లు మంగళవారం జిల్లా కేంద్రంలోని బాలసదనంలో చిన్నారులకు కూలర్లు వితరణ చేశారు. అదేవిధంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏటా మున్సిపల్ మాజీ చైర్మన్ అక్కల సాయిబాబ వర్ధంతి సందర్భంగా అనేక సేవ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

'నడిగడ్డ అభివృద్ధికి కృషి'



మానవపాడులో మాట్లాడుతున్న నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి మల్లు రవి

మానవపాడు: నడిగడ్డ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఢిల్లీ ప్రత్యేక అధికార ప్రతినిధి జితేందర్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి మల్లు రవి, జెడ్పీచైర్‌పర్సన్ సరిత, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా వాహనయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అలంపూర్ అభివృద్ధికి కృషి చేస్తానని తెలియజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఆగస్టు 15 ముందే రూ.2 లక్షల రుణమాఫీ చేస్తుందన్నారు. మల్లమ్మకుంట, వల్లూరు, జూలెకల్ రిజర్వాయర్ నిర్మిస్తామని, పార్లమెంట్ అభ్యర్థిని గెలిపించి నడిగడ్డ సత్తాను చూపించాలని జితేందర్‌రెడ్డి కోరారు.

శాంతినగర్: కృష్ణానదిపై 68.5 టీఎంసీల నీటి వాటాను బీఆర్ఎస్ ప్రభుత్వం సాధించలేకపోయిందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని శాంతినగర్ కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో 17 పార్లమెంట్ స్థానాలు గెలవబోతున్నామన్నారు. కాంగ్రెస్ హయాంలో పంటలకు బీమా చేసేవాళ్లమన్నారు. బీఆర్ఎస్ హయాంలో బీమా ఎత్తివేశారన్నారు. కేసీఆర్ మెడలు వంచుతానని, చివరకు అదే నియంత వద్దకు పోవడం బాధకరమన్నారు.

కాంగ్రెస్ నాయకుల మధ్య మాటల యుద్ధం

శాంతినగర్: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ నాయకుల మధ్య మాటలయుద్ధం జరిగింది. పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి మంత్రితో పాటు, ఎంపీ అభ్యర్థి, రాష్ట్ర, జిల్లా నాయకులు శాంతినగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి మంగళవారం సాయంత్రం చేరుకున్నారు. మంత్రి విలేకర్ల సమావేశం నిర్వహించిన అనంతరం నేతలందరు క్యాంపు కార్యాలయంలోని గదిలోకి వెళ్లారు. ఈ సందర్భంగా గద్వాల నియోజకవర్గానికి చెందిన ఇద్దరు సీనియర్ నేతల మధ్య మాటల యుద్ధం జరిగింది. తాము పార్టీ గెలుపు కోసం అహర్నిషలు కష్టపడ్డామని, తమకు మంత్రి వస్తున్న సమాచారం ఇవ్వకుండా, అవమానపరచడమేంటని గద్వాలకు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు (భార్యాభర్తలు) ప్రశ్నించడంతో ఇరువురు నేతల మధ్య వాగ్వాదం తారా స్థాయికి చేరింది. దీంతో లోపల ఏమి జరుగుతుందోనని మండల నాయకులు, కార్యకర్తలు అయోమయానికి గురయ్యారు. మాజీ ఎమ్మెల్యే కలుగజేసుకుని గొడవ పడటం పార్టీకి మంచిదికాదని, గద్వాలకు వచ్చి ఇద్దరి మధ్య సయోధ్య కుదుర్చుతామని నచ్చజెప్పడంతో సమస్య సద్దుమనిగింది. దీంతో నాయకులు, కార్యకర్తలు ఊపిరిపీల్చుకున్నారు.

వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు పాటించాలి



మల్దకల్‌లో వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షిస్తున్న వ్యవసాయ అధికారులు, రైతులు

మల్దకల్: వ్యవసాయ శాస్త్రవేత్తలు ఇచ్చే సలహాలు సూచనలు పాటించి రైతులు అధిక లాభాలు పొందాలని మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్ సూచించారు. మంగళవారం మల్దకల్ రైతువేదికలో వ్యవసాయ, జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు రైతులతో నేరుగా మాట్లాడారు. తక్కువ పెట్టుబడులతో ఎక్కువ లాభాలు వచ్చే పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. పంటల సాగు విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. పంటలకు ఆశించే చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రియ ఎరువుల వాడకం ద్వారానే భూమి సారవంతంగా ఉంటుందన్నారు. వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలు పాటించాలన్నారు. ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

రాములోరి ఆలయాలు ముస్తాబు



ఉండవెల్లిలో కలశ పూజలు చేస్తున్న అర్చకులు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడులకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం రాములవారి ఆలయంలో కుంబారాదన, సేవాకాలం, నిత్యహోమం నిర్వహించారు. శ్రీరామనవమి సందర్భంగా ఆంజనేయస్వామి ఆలయాన్ని ముస్తాబు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో రాములవారి కల్యాణానికి హాజరుకావాలని ఆలయ సిబ్బంది కోరారు.

కేటీ దొడ్డి: శ్రీరామనవమిని పురస్కరించుకుని మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఆలయాలకు మంగళవారం ముస్తాబు చేశారు. మండలంలోని కొండాపురం, చింతలకుంట, కుచినెర్ల, ఇర్కిచేడు, పాతపాలెం గ్రామాల్లో బుధవారం నిర్వహించే సీతారాముల కల్యాణానికి మామిడి తొరణాలతో అందంగా అలంకరించారు. ఆలయంలోని అన్నదానం ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలిపారు.

రోగులకు మందులు ఆన్‌లైన్ చేయాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ రాజు

మానవపాడు: ఆరోగ్యకేంద్ర పరిధిలోని ఆయా గ్రామాలలో దీర్ఘకాలిక రోగులకు అందించే బీపీ, షుగర్‌కు సంబంధించిన మందులు ఆన్‌లైన్ చేయాలని జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ రాజు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో డాక్టర్ రిజ్వానా తాన్వీర్ ఆధ్వర్యంలో ఎంఎల్‌హెచ్‌పీ స్టాఫ్‌లకు, ఏఎన్ఎంలు, ఎన్సీడీ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ ఏర్పాటు చేస్తున్నారా? లేదా.. అనే దిశగా అందరిని అడిగి తెలుసుకున్నారు. త్వరలో వారికి ఎన్‌సీడీ నందు అందరికి అబ్బా కార్డ్స్ లింక్ చేయాలని తెలిపారు. బీపీ, షుగర్ రికార్డులను తనిఖీ చేశారు. ఎన్‌సీడీపై రివ్యూ తీసుకోవడం, నెలలో జరిగే ఎన్‌సీడీ మందులు సక్రమంగా పంపిణీ చేస్తున్నారా? పేషంట్లకు ట్రీట్మెంట్ కార్డ్స్ ఇచ్చే విధానంలో సలహాలు, సూచనలు అందించారు. వచ్చేవారం సెంట్రల్ టీం పరిశీలనకు వస్తున్నారని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం కో ఆర్డినేటర్స్ శ్యాంసుందర్, మక్బూల్, సత్యనారాయణ, హెలెన్, చంద్రన్న, సంధ్యారాణి, తిరుమల్‌రావు, ఎంఎల్‌పీహెచ్ఎస్‌లు, పీహెచ్‌సీ తదితరులు పాల్గొన్నారు.

కల్లుదుకాణంపై ఎక్సైజ్ దాడులు

ఎర్రవల్లిచౌరస్తా: అనధికారికంగా నిర్వహిస్తున్న కల్లు దుకాణంపై ఎక్సైజ్ అధికారులు సోమవారం రాత్రి దాడులు నిర్వహించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ బాలకృష్ణారెడ్డి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని కొండపేటకి చెందిన వెంకటేష్‌గౌడ్, రజినిబాబుగౌడ్ గ్రామంలో అక్రమంగా కల్లు విక్రయిస్తున్నారనే నమ్మదగిన సమాచారం రావడంతో ఎక్సైజ్ ఎస్ఐ వెంకటేష్‌గౌడ్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో కల్లు దుకాణంలోని 234 లీటర్ల కల్లుని గుర్తించి అక్కడే ధ్వంసం చేసి వారి నుంచి 40 కిలోల సీహెచ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దాని విలువ సుమారు రూ.2 లక్షల వరకు ఉంటుందని, ఈ సంఘటనపై కేసు నమోదు చేసి నిందితులను మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

సారా బట్టీలపై...

కేటీదొడ్డి: అనుమతి లేకుండా మద్యం, సారా తయారు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని గద్వాల జిల్లా ఎక్సైజ్ అధికారి అరుణ్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని వాగుతండా, తూర్పుతండా, సారా బట్టీలపై ఎక్సైజ్ అధికారుల ఆధ్వర్యంలో దాడులు నిర్వహించగా.. 300 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని 300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అనంతరం సింగనేడితండాలో 2 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని 200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి ఒకరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో గద్వాల ఎక్సైజ్ సీఐ గణపతి రెడ్డి, టాస్క్‌ఫోర్స్ సీఐ సైదిరెడ్డి, ఎస్ఐలు వారి సిబ్బంది ఉన్నారు.

విద్యుదాఘాతంతో గడ్డి ట్రాక్టర్ దగ్ధం



గార్లపాడులో దగ్ధమవుతున్న వరిగడ్డి ట్రాక్టర్

ధరూరు: పశువుల మేత వరి గడ్డితో వెళ్తున్న ట్రాక్టర్ విద్యుదాఘాతంతో నిప్పంటుకుని పూర్తిగా కాలిపోయిన సంఘటన మండలంలోని గార్లపాడులో మంగళవారం చోటుచేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం.. గార్లపాడుకు చెందిన కుమ్మరి రమేష్ పొలంలో యాసంగి వరి సాగు చేశాడు. ఇటీవల కోత కోయడంతో వారి బంధువు గట్టు మండల లింగాపురం గ్రామానికి చెందిన రాములు పశువుల మేత కోసం మంగళవారం గార్లపాడు నుంచి ట్రాక్టర్‌లో గడ్డిని మధ్యాహ్నం రెండు గంటల సమయంలో బయలుదేరాడు. ఈ క్రమంలో పొలంలో ఉన్న విద్యుత్ లైన్ తీగలు తగిలి విద్యాదాఘాతానికి గురై మంటలు చెలరేగాయి. గడ్డికి మంటలు అంటుకోవడంతో అక్కడున్న రైతులు, కూలీలు మంటలు ఆర్పే ప్రయత్నం చేసి నా ఫలితం లేకపోయింది. దీంతో టాక్టర్ ట్రా లీతో పాటు ఇంజన్ పూర్తిగా కాలిపోయింది. దీంతో బాధిత రైతులు బోరున విలపించారు. ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.